నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | ఫిబ్రవరి 15, 2025 | www.navatelangana.com

పెద్దమ్మ ఆలయంలో దొంగతనం


వివరాలు తెలుసుకుంటున్న పోలీసు అధికారి

నవతెలంగాణ-రామారెడ్డి

పాల్వంచ మండలం సింగరాయపల్లిలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పెద్దమ్మ ఆలయంలో దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలోని హుండీని ఆరు బయట పగులగొట్టి నగదును, అమ్మవారి బంగారు బొట్టు బిళ్లను దొంగిలించినట్టు సామా గంజి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. పక్కనే ఉన్న ఎల్లమ్మ దేవి ఆలయంలో దొంగతనానికి ప్రయత్నించగా.. ఆలయ తలుపులు తెరవకపోవడంతో విఫలమయ్యారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య



నవతెలంగాణ-తాడ్వాయి

కడుపునొప్పి బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కాళోజివాడి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మరి మల్ల సాయవ్వ (60) గత కొంతకాలం నుంచి కడుపునొప్పి బాధతో పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నప్పటికీ నయం కాలేదు. బాధ భరించలేక గురువారం గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుమారుడు శంకర్ తాడ్వాయి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఫోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- హెడ్ మాస్టర్స్, టీచర్స్‌లకు ఫోక్సో చట్టంపై ఒక రోజు ఓరియంటేషన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఫోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. తెలంగాణలోనే మొట్టమొదటి సారిగా ప్రతి పాఠశాల నుంచి ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌ను నియమించినట్టు వివరించారు. శుక్రవారం స్థానిక కళాభారతిలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా నియమించబడిన హెడ్ మాస్టర్స్, టీచర్స్‌లకు ఫోక్సో చట్టంపై ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియమించబడిన ప్రొటెక్షన్ ఆఫీసర్ పాఠశాలలో పిల్లల పట్ల ఎటువంటి లైంగిక దాడులకు గురికాకుండా వాటిని ప్రారంభ దశలోనే అణిచివేసే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వీటిలో భాగంగా జిల్లాలో ప్రతి పాఠశాల నుంచి ఒక ప్రొటెక్షన్ ఆఫీసర్, హెడ్‌మాస్టర్‌ను ఎంపిక చేసి వారికి చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్స్ విధులపైన సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ చిల్డ్రన్స్ ఇన్ స్కూల్ కాన్సెప్ట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా మొట్టమొదటగా కామారెడ్డి జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్‌కు యునిసేఫ్ వారి సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఫోక్సో చట్టంపై, ఆ చట్టంలో నిర్దేశితమైన బాధ్యతలను వివరించారు. పాఠశాలలలో సమస్యలు తలెత్తినప్పుడు వాటిని సమర్థవంతంగా పరిష్కరించే పరిజ్ఞానం హెడ్ ఆఫ్ ది ఇన్స్టిట్యూషన్స్‌కు ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివిధ రకాల వేధింపులపై వివరించారు. జిల్లాలో సమర్థవంతమైన పాఠశాలలను తయారు చేసే దిశగా ప్రతి పాఠశాలలో సిబ్బందికి చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. సీసీ టీవీ కెమెరాల పనితీరును, అన్ని ప్రదేశాలలో కవరేజ్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినీలకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌ల గురించి వివరించాలని తెలిపారు. వేధింపుల ఘటనలు జరిగినప్పుడు ఆ విషయాన్ని రిపోర్ట్ చేసే విధంగా విద్యార్థినీలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా కంప్యూటర్ ల్యాబ్, వరండాలలో సీసీ టీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థినీలను స్వంత పిల్లల చూడాలని తెలిపారు. సిడబ్ల్యుసి మెంబర్ స్వర్ణలత మాట్లాడుతూ.. ఆడపిల్లలు హింసకు గురికాకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, యునిసెఫ్ రిసోర్స్ పర్సన్ డేవిడ్ రాజ్, రెసిడెన్షియల్ పాఠశాలల హెడ్‌మాస్టర్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పలువురు హెడ్‌మాస్టర్స్, ఉపాధ్యాయులకు బ్యాడ్జెస్‌లను కలెక్టర్ పంపిణీ చేశారు.


ఉపాధ్యాయులకు బ్యాడ్జ్‌లను అందజేస్తున్న కలెక్టర్


ఓరియంటేషన్ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు

'ఆర్మూర్ ఎమ్మెల్యేగారి తాలూకా'



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రతీ వాహనానికి ఆ వాహనానికి సంబంధించిన నెంబర్ ముఖ్యం. కానీ ఓ ద్విచక్రవాహనానికి మాత్రం 'ఆర్మూర్ ఎమ్మెల్యే గారి తాలూకా' అని బండి నెంబర్ ప్లేట్‌పై రాసి ఉంది. బండి నెంబర్ మాత్రం చిన్నదిగా ఉంది. దీంతో ఆ వాహనాన్ని చూసిన పలువురు ముక్కున వేలేసుకున్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే గారి తాలూకా అని రాసి ఉండడంతో అది చూసిన పలువురు వాహనదారులు ఈ బైక్ ఎమ్మెల్యేదా..?, ఎమ్మెల్యే అనుచరులు ఉపయోగిస్తున్నారా?, లేక ఇతరులదా..? అనే సందేహం నెలకొంది. ఏదేమైనా నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్‌పై కేవలం వాహనానికి సంబంధించిన నెంబర్‌తో కూడిన వివరాలు మాత్రమే ఉండాలి. కానీ ఇలా తెలుగు అక్షరాల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే గారి తాలూకా అని రాసి ఉండటం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పాటించకుంటే సామాన్యుల వాహనాలను పట్టుకుని ఫైన్‌లు వేసే పోలీసులకు ఇలాంటి వాహనాలు కనబడవా..? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ వాహనం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద నవతెలంగాణ కెమెరాకు చిక్కింది.

నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం

- ఎస్ఈ రవీందర్

నవతెలంగాణ-బోధన్

నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎస్ఈ రవీందర్ అన్నారు. శుక్రవారం బోధన్ మండలం సంగం గ్రామంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌కు పెంటాఖుర్దు ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరాను అనుసంధానించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయడానికి ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేకంగా చర్యలు చేపట్టిందని తెలిపారు. 33 కెవి రుద్రూర్ ఫీడర్ నుంచి సంగం సబ్‌స్టేషన్ వరకు 3.5 కిలోమీటర్ల లైన్‌తో ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి అనుసంధానించినట్లు తెలిపారు. 33 కేవి రుద్రూర్ ఫీడర్ 30 లక్షల వ్యయంతో నిర్మాణం చేసినట్టు పేర్కొన్నారు. రుద్రూర్ ఫీడర్ ఏర్పాటు చేయడంతో రెండు 132 కెవి సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు 132 కెవి జాకోర, కోటగిరి సబ్ స్టేషన్‌ల నుంచి విద్యుత్ సరఫరా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఈ టెక్నికల్ ఎ.రమేష్, డి.ఈ ఆపరేషన్ బోధన్ ఎండి ముక్తార్, డి.ఈ కన్‌స్ట్రక్షన్ డి.వెంక టరమణ, ఏడీఈ ఆపరేషన్ కే.నగేష్ కుమార్, ఎడిఈ కన్‌స్ట్రక్షన్ తోట రాజశేఖర్, బోధన్ రూరల్ ఏఈ మారుతి, ఏఈ కన్‌స్ట్రక్షన్ బోధన్ ఆర్.సుమిత, ఎస్ఎల్ఐడిసి రాజు, ఎల్ఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ సరఫరాను అనుసంధానిస్తున్న దృశ్యం

బస్సును ఢీకొన్న లారీ

- 8 మందికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-కామారెడ్డి

బస్సును లారీ ఢీకొనడంతో 8 మందికి గాయాలైన ఘటన కామారెడ్డి శివారులోని టేక్రియాల్ బైపాస్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ డిపో-1కు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు కామారెడ్డికి 15 మంది ప్రయాణికులతో వెళ్తుంది. టేక్రియాల్ బ్రిడ్జి కింద రోడ్డు పనులు జరుగుతుండడంతో బైపాస్ బ్రిడ్జి పైనుంచి బస్సు వచ్చి వంతెన ఎండింగ్ వద్ద కామారెడ్డి వైపు యూటర్న్ తీసుకుంటుండగా నిజామాబాద్ నుంచి వస్తున్న లారీ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో బస్సు మధ్య భాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ రాములుతో సహా 8 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల బాలుడు అర్జున్, స్వప్న, విఠల్, దీప్తి, వీరవ్వ విజయ, ఉమారాణి, డ్రైవర్ రాములు ఉన్నారు. ఇందులో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బస్సును ఢీకొన్న లారీ

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన


ఆస్పత్రి సిబ్బందితో జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం అధికారిణి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం అధికారిణి పద్మజ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో లభించే సేవలపై, అన్ని జాతీయ ప్రోగ్రాములలో అనుసరించే విధానాలపై వివరించారు. ఆయా గ్రామాల్లో గల సబ్ సెంటర్‌లో ప్రజలకు అందించే సేవలను గురించి మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్, సూపర్వైజర్లు సునంద, మణెమ్మ, డిఇఓ బాలకృష్ణ, ఫార్మసిస్ట్ జయశ్రీ, ల్యాబ్ టెక్నీషియన్ హరి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభు కిరణ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఫార్మసీ, ల్యాబ్, ఆస్పత్రి పరిసరాలు, ఓపి వివరాలు పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకుని ధైర్యాన్ని నింపాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించాని, టీకాల వివరాలు, రికార్డులు పరిశీలించారు. ఈ పరిశీల నలో మెడికల్ అధికారి ఏమిమా, దివ్య, హెచ్ఈఓ వెంకటరమణ, హెల్త్ సూ పర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

చద్మల్ పేద ప్రజల భూముల కోసం
నిరంతరం పోరాటం చేస్తాం

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని చద్మల్ గ్రామ పేద ప్రజల భూముల కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని చర్మల్ గ్రామంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాష్ నాయక్ అధ్యక్షతన తెలంగాణ రైతు సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోతీరాం నాయక్ మాట్లాడారు. గత 100 సంవత్సరాల నుంచి ప్రభుత్వ భూమిని అలాగే పోడు భూమిని సాగు చేసుకుంటూ ఉన్న దళిత పేదలు నివసిస్తున్నారని, కానీ గత పదేళ్ల క్రితం మైనింగ్ పేరుతో కొంత భూమి గుంజుకున్నారని తెలిపారు. ఎటువంటి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. అలాగే భూమికి బదులు భూమి ఇస్తామని చెప్పి భూమి చూయించలేదన్నారు. కొంతమంది పోడు భూమిని సాగు చేసుకుంటూ ఉన్నారని, వారికి ఎటువంటి హక్కుపత్రాలు ఇవ్వలేదని తెలిపారు. కాగా ఎటూ తోచని పరిస్థితుల్లో అక్కడ దళితులు నివసిస్తున్నారని చెప్పారు. అందుకని రైతు సంఘం ముందుండి వారి భూముల పట్టాలు సాధించేంతవరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, గంగవ్వ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-రెంజల్

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం పరిశీలించారు. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలోని శాసనమండలి ఉపాధ్యా య పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఉన్న మౌలిక వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా, ర్యాంప్, టాయిలెట్స్ తదితర వసతులను కల్పించాలన్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎన్నికలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌ను ఆదేశించారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అదనపు గదులను ఆయన పరిశీలించారు. ఆర్ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల సందర్శన..

మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు 40 శాతం మెస్‌చార్జీలను పెంచడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్ హర్షియా నాజాంకు సూచించారు. కిచెన్, డైనింగ్‌హాల్, స్టోర్ రూములను పరిశీలించారు. బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యత, సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ పాఠశాలలో 418 మంది విద్యార్థులున్నారని, ఇటీవల కొత్త బియ్యం రావడం వల్ల అన్నం మెత్తగా అవుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రిన్సిపాల్ హర్షియా నాజాం ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన ఫోన్‌లో ఎమ్మెసెల్ పాయింట్ అధికారులతో మాట్లాడి.. పాఠశాలలకు పాత బియ్యాన్ని సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంతో పాటు ఈగలు దోమలు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ శ్రావణ్ కుమార్, పాఠశాల పిన్సిపాల్ హర్షియా నాజామ్ ఉన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

మండల, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు
సమర్థవంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

మండల, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు జరిగే ఎన్నికలు సమర్థవంతంగా ఎన్నికల నియమావళి మేరకు ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. రిటర్నింగ్ అధికారులకు, సహాయ రిటర్నింగ్ అధికారులకు అందజేసిన రూల్స్ పుస్తకాలను చదవాలని, ఎన్నికల నియమ నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, ఉపసంహరణ, అప్పీలు, తదితర విషయాలను శిక్షణలో తెలుసుకోవాలని అన్నారు. ఈ శిక్షణను మాస్టర్ ట్రైనర్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఏమైనా సమస్యలుంటే నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ శిక్షణలో జడ్పీ సీఈవో చందర్‌నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

మహిళపై సీఐ లాఠీచార్జ్

- తీవ్ర గాయాలు
- ఎడపల్లి పోలీస్ స్టేషన్లో బాధితురాలి ఫిర్యాదు



రోదిస్తున్న బాధితురాలు.. లాఠీచార్జీచేయడంతో కాలికి గాయం

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన బోయి జ్యోతి అనే మహిళపై బోధన్ సీఐ లాఠీచార్జి చేయడంతో జ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా దూపల్లికి చెందిన జ్యోతి తన కొడుకుతో కలిసి గురువారం వెళ్లింది. జాతరలో కుమారునికి ఆటవస్తువులు, తినుబండారాలు కొనుక్కొని దిగుతుండగా పర్సు కనబడకపోవడంతో కోనేరు వద్ద పోలీసులు కనపడగా.. 'నా పర్సు పోయింది.. వెతికించాలి' అని పోలీసులకు ఆమె కోరారు. దీంతో బోధన్ రూరల్ సీఐ విజయబాబు లాఠీతో ఆమెపై వాతలు వచ్చేట్టు కొట్టాడు. దీంతో ఆమె రోదిస్తూ ఇంటికి వెళ్లింది. ఆమె కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకొని బోధన్ రూరల్ సీఐ విజయబాబుపై ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహం నిలిపివేసిన అధికారులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని కల్దుర్కి గ్రామంలో శుక్రవారం ఓ బాల్య వివాహాన్ని బాలిక శిశుసంరక్షణ అధికారులు నిలిపివేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామానికి చెందిన యువకుడితో మహారాష్ట్రకు చెందిన మైనర్ బాలికతో వివాహం చేస్తున్నారనే సమాచారంతో ఐసీడీఎస్ అధికారులు, బోధన్ రూరల్ పోలీసులు గ్రామానికి చేరుకుని బాల్య వివాహం జరగకుండా నిలిపివేశారు. ఇరు కుటుంబాల వారికి జిల్లా శిశుసంరక్షణశాఖఅధికారి జమ్రూ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మీ, బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్యవివాహాల వలన కలిగే పర్యవసానాలు, నేరాలపై వివరించారు. దాంతో ఇరు కుటుంబాలు బాల్య వివాహం చేయబోమని అంగీకరించి అధికారుల సమక్షంలో లిఖిత పూర్వకంగా అంగీకారం తెలిపారు.

ఈపాస్ ద్వారానే యూరియా పంపిణీ

- ఏడిఏ అలీముద్దీన్

నవతెలంగాణ-రెంజల్

ఈపాస్ ద్వారానే యూరియాను పంపిణీ చేస్తున్నట్టు ఏడిఏ అలీముద్దీన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గురువారం యూరియా పంపిణీలో ఈ పాస్ మిషన్ పనిచేయకపోవడంతో బయోమెట్రిక్ వేలిముద్ర రాని రైతులకు ఆధార్ కార్డు ఓటీపీ ద్వారా పంపిణీ చేశామని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట రెంజల్ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, సీఈవో ఇంద్రసేన్ తదితరులున్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై చర్చ వేదిక

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం రోజు విద్యుత్ వినియోగదారుల సమస్యలపై చర్చ వేదిక నిర్వహించారు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుండి ప్రత్యేక అధికారులు హాజరై వివిధ సమస్యలపై చర్చించినట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. చర్చా వేదిక సీజీఆర్ఎఫ్ చైర్మన్-ఎరుకల నారాయణ, మెంబర్ టెక్నికల్స్ సలంద్ర రామకృష్ణ, లకావత్ కిషన్ సమక్షంలో నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించారు. కార్యక్రమంలో మెంబెర్స్ ఆఫ్ ఫైనాన్స్ సభ్యులు-మద్రిపల్లి రాజా గౌడ్, మెంబర్ ఆఫ్ సీజీఆర్ఎఫ్, ఏడీఈ రాజేశ్వర్, ఆర్మూర్ డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్ పి.వి రాజేశ్వరరావు, ఆర్మూర్ సబ్ డివిజన్ ఏడీఈ కృష్ణ, పెర్కిట్ ఏడీఈ శ్రీనివాస్, ముప్కాల్ ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ కాంతారావు, విద్యుత్ సిబ్బంది కిషోర్, వసంత్ రావ్, విద్యుత్ వినియోదారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఎర్పడుతుందని నిజామాబాద్ టౌన్ ఏడిఈ 1,2,3 ఆర్ .చంద్ర శేఖర్, ఆర్.ప్రసాద్ రెడ్డి, పి.వీరేశం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని గాయత్రి నగర్ రోడ్ నెంబర్ 1, 2, 3, 4, 5, ఆకుల పాపయ్య కాలనీ, చింత చెట్టు మైసమ్మ, కాశీనగర్, సిద్ధి వినాయక రోడ్, ఆర్యవైశ్య సంఘం, సాయి కృప నగర్, న్యాలకల్ ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినాయకనగర్ సబ్ స్టేషన్ లోని ఆర్య నగర్-1 ఫీడర్లలో చెట్ల కొమ్మలు తగులుతున్నందున విద్యుత్ వైర్ లైన్లకు క్లియర్ చేయు సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. న్యూ హౌసింగ్ బోర్డ్, పవర్ హౌస్ కాంపౌండ్ నిర్వహణ సందర్భంగా ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైలులో గుండెపోటుతో మహిళ మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



కుంభ మేళా నుంచి తిరిగి ఇంటికి వెళ్తున్న మహిళ గుండె పోటుతో రైలులో మృతి చెందింది అని నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయి రెడ్డి శుక్రవారం తెలిపారు. హైదరాబాద్ ఎక్స్ ప్రెస్ లో గుర్తు తెలియని మహిళ గుండె పోటుతో మృతి చెందిందని నిజామాబాద్ స్టేషన్ మాస్టర్ హరికృష్ణ గురువారం రాత్రి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయిరెడ్డి సిబ్బంతో కలిసి మహిళ మృత దేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతురాలి బ్యాగులో లభించిన ఆధార్ కార్డు, ఫోన్ ఆధారంగా ఆమెను కర్నాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా బస్వాకళ్యాణ్ మండలం మిర్జాపూర్, బీదర్ కు చెందిన అనిత (59) గా గుర్తించారు. ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయి రెడ్డి తెలిపారు.

వీర జవాన్లకు నివాళులు



నివాళుఅర్పిస్తున్న విద్యార్థులు, పాఠశాల సిబ్బంది

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో పుల్వామా ఘటనలో మృతి చెందిన జవాన్లకు ఘనమైన నివాళులు అర్పించారు. భావితరాలు మీ త్యాగాలను మర్చిపోవు. దేశం కోసం మీరు ప్రాణాలు అర్పించారు. మిమ్మల్ని దేశం మరువదు" అని మననం చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బేతాళ సాయిలు, జై భారత్ యూత్ అధ్యక్షులు నాయుడు సాయిరాం, మాజీ విడిసి అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ జగదీష్ యాదవ్, చిన్నోల శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ దేవదాస్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రవీణ్, వ్యాయామ ఉపాధ్యాయుల దేవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

దామోదర సంజీవయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. శుక్రవారం హైదరాబాదులోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో దామోదర సంజీవయ్య చిత్రపటానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు చారగొండ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తదితరులు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు.

ఆరోగ్యం..పోషణ పట్ల మహిళలందరిని చైతన్యం చేయాలి

- డిఆర్‌డిఓ సాయగౌడ్



మాట్లాడుతున్న డిఆర్‌డిఓ సాయగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో గల మహిళా సంఘా సభ్యులకు ఆరోగ్యం..పిల్లల పోషణ,పరిసరాలు పరిశుభ్రత, పారిశుధ్యం, రక్తహీనత, సమతుల ఆహారం తీసుకునేలా గర్భవతిగా తీసుకోవలసిన జాగ్రత్తలు మొదలగు అంశాలపై అవగాహన కల్పించాలని ఏపిఎంఎస్, సీసీ లకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు, ఆదాయం పెరిగిన దానికి తగిన విధంగా ఖర్చులు పెరిగినా విధంగా జీవన శైలి లో మార్పులు ,మంచి ఆహారపు అలవాట్లు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మంచి ఆహారపు అలవాట్లు జీవన ప్రమాణాలను పెంచుతాయని, ఆరోగ్యమే మహాభాగ్యంగా మహిళలందరూ జీవించాలని కోరారు. ఈ శిక్షణలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ ,రిసోర్స్ పర్సన్ లు గా డిపిఎం సాయిలు, శ్రీనివాస్, ఏపిఎంఎస్ సరోజినీ, గంగాధర్, రాజేందర్ అన్ని మండలాలు ఏపీఎం లు, సీసీ లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నగర మహాసభలను విజయవంతం చేయండి

- కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర మహాసభలను విజయవంతం చేయాలని కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు . ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ 16వ నగర మహాసభలను స్థానిక హమల్వాడిలోని పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫీసులో నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. కొఠారి కమిషన్ ప్రకారం జిడిపి లో 06శాతం బడ్జెట్లో 10 శాతం కేటాయించాలని ఉన్న దాన్ని అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే బడ్జెట్లో సమూల మార్పులు చేసి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పట్టించుకోకపోతే భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, సాయి, వినోద్, నాయకులు పాల్గొన్నారు.

ఇనాయత్‌నగర్‌లో ఎక్సైజ్ పోలీసుల దాడి

- నాటు సారా స్వాధీనం, ఒకరి అరెస్ట్
- తహసిల్దార్ ముందు నిందితుడి బైండోవర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



నిందితుడిని బైండోవర్ చేసిన పోలీసులు

మండలంలోని ఇనాయత్ నగర్ సర్పంచ్ తండాలో నాటు సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఎక్సైజ్ పోలీసుల దాడి చేశారు. మోర్తాడ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గుండప్ప ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు గ్రామానికి చెందిన బనావత్ బక్షి ఇంటిలో సోదాలు చేశారు. సోదాల్లో బక్షి ఇంటి నుండి అక్రమంగా తయారు చేసి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన లీటర్ నాటు సారాను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారుచేసిన నిందితుడు బక్షిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గుండప్ప తెలిపారు. అనంతరం నిధితుడు బనావత్ బక్షిని కమ్మర్ పల్లి తహసిల్దార్ ఆంజనేయులు ముందు బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ బి. మానస, హెడ్ కానిస్టేబుల్ మార్వాది శంకర్, కానిస్టేబుళ్లు ఆర్.అశోక్, ఎం. కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న రేవంత్ రెడ్డి సర్కార్
- యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి
- పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్ డిమాండ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి ఐక్యత సంఘం పిడిఎస్‌యు నాయకులు జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు కామ్రేడ్ అనిల్ కుమార్, ఆర్మూర్ ఏరియా ప్రధాన కార్యదర్శి మమత మాట్లాడుతూ..పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్లను విడుదల చేయాలని విద్యార్థులకు బకాయిలు విడుదల చేయాలని అన్నారు. విద్యార్థులు మౌలిక వసతుల కల్పనలో ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి చదువుకు ఆర్థిక భారం పడకుండా రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ రిలీజ్ చేయాలని అన్నారు. ఇప్పటివరకు తెలంగాణలో విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని, వారిని నియమించాలని, యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తిని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఐదవ తరగతి ఎనిమిదోవ తరగతిలో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని వారు తెలియజేశారు. ఈ సమస్యలను



మాట్లాడుతున్న పిడిఎస్‌యూ నాయకులు

పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలను చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు అభినయ్, బింరావు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్యదైవం.. సేవాలాల్ మహరాజ్

- నేడు సంత్ సేవాలాల్ జయంతి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఉపవాస దీక్షలు చేయనున్న బంజారాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్...ఈ పేరు వింటే చాలు దేశ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది బంజారాల ప్రజల హృదయాలు భక్తిభావంతో పరవశించిపోతాయి. గిరిజన తండాలలో ఉన్న సేవాలాల్ మహరాజ్ ఆలయాలు నిత్యం సేవాలాల్ నామస్మరణతో మార్మోగుతుంటాయి. బంజారాలు ఆయనను తమ కులదైవంగా కొలుస్తారు. శనివారం సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం....

మహరాజ్‌ను బంజారా ప్రజలు 'మోతివాళో' 'సేవాభాయా' అనే పేర్లతో కూడా పిలుస్తారు. ప్రతి తండాలో సేవాలాల్ మహరాజ్ ఆలయంతో పాటు జగదాంబ దేవి ఆలయాలు కూడా ఉంటాయి. జయంతి రోజు మహరాజ్ ఆలయాల్లో భోగ్, భండార్, ఖీర్(పాయసం)తో మహరాజ్‌కు నైవేద్యం సమర్పించి ఉపవాసాలు చేస్తారు. ఆయురారోగ్యాలు, సకల సంపదలు ఇవ్వాలని కోరుకుంటారు. తమ బంజారా సమాజాభి వృద్ధికి, చైతన్యానికి కృషి చేసిన దేవుడు సేవాలాల్ మహరాజ్ అని బంజారాలు బలంగా విశ్వసిస్తారు. ఇప్పటికే అనేక మంది యువకులు సేవాలాల్ దీక్షను స్వీకరించి ఆధ్యాత్మికత వైపు అడుగులు వేస్తున్నారు.

మహరాజ్ జన్మనేపథ్యం....

బంజారా చరిత్ర ఆధారంగా రాథోడ్ వంశానికి చెందిన రమావత్ భీమానాయక్, ధర్మిణి యాడి దంపతులకు 1739లో ఫిబ్రవరి 15న సేవాలాల్ మహరాజ్ జన్మించాడు. సేవాలాల్ మహరాజ్ దేవిమాతకు పూజలు చేస్తూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించారు. అటవీ ప్రాంతంలో జీవిస్తున్న బంజారాలంతా భవిష్యత్తులో ఉన్నతస్థితికి చేరుకుంటారని, దాని కోసం ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలని సూచించేవారు. ఇందుకోసం బంజారాలంతా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పేవారు. ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తేనే సమాజ వికాసం జరుగుతుందని ఉద్బోధించేవారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకున్నారు. ఈ విధంగా సేవాలాల్ మహరాజ్ ఆధ్యాత్మిక చైతన్యకారుడిగా పేరు తెచ్చుకున్నారు. చివరకు దేవిమాతా శక్తి మహిమలతో మహారాష్ట్రలోని పౌరఘడ్‌లో స్వర్గస్తులైనారని చరిత్ర ద్వారా తెలుస్తుంది. మహరాజ్ సమాధి ఉన్న పౌరఘడ్ ప్రసిద్ధ బంజారా పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది.

సెలవుదినంగా ప్రకటించాలి...

బాణోత్. ప్రేమ్‌లాల్- బంజార కవి, రచయిత



ఆధ్యాత్మికతను, నీతిని ప్రబోధించిన సేవాలాల్ బంజారాలకు ఆరాధ్యుడు ఆయన జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి. సేవాలాల్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి. అన్ని తండాల్లో సేవాలాల్ మహరాజ్ ఆలయాలను నిర్మించాలి.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా బంజారా సేవా సంఘం నాయకులు, యువకుల కోరిక మేరకు తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం స్వచ్ఛంద రక్త దాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిజామాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ముఖ్యంగా బంజారా యువత స్వచ్ఛంద రక్త దానం చేసి ప్రాణ దాతలు కావాలని కోరారు. ఈనెల 15 శనివారం ఉదయం 10 గంటలకు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని శనివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు నుడా చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు కేశవ వేణు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఉదయం కేక్ కటింగ్ నిర్వహించడం జరుగుతుందని అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సరైన సమయానికి హాజరు కావాలన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు యాదగిరి



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

సీపీఐ ఎంఎల్ మస్ లైన్ రాష్ట్ర నాయకులు ఆదర్శ కమ్యూనిస్టు విప్లవకారుడు కామ్రేడ్ కర్నాటి యాదగిరి సంతాపసభను ఈనెల 17న నిజామాబాద్ నగరంలో నిర్వహిస్తున్నట్టు సీపీఐ ఎంఎల్ మస్ లైన్ డివిజన్ కార్యదర్శి డివిజన్ కార్యదర్శి బి దేవారం తెలిపారు. శుక్రవారం మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో సంతాపసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యాదగిరి అన్న కు మనోహరాబాద్ గ్రామానికి చాలా సంబధం ఉందని, యాదగిరి అన్న ప్రభుత్వ ఉద్యోగాన్ని వది 50 సంవత్సరాలు పైగా విప్లవోద్యమ జీవితం ఆదర్శవంతంగా బతికారని తెలిపారు. ఈ నెల 17న రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో జరిగే సంతాప సభకు మేధావులు, విద్యార్థులు సానుభూతిపరులు హాజరై విప్లవ జోహార్లు అర్పించాలని వారు అన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ కార్యదర్శి బి కిషన్,నాయకులు రాజారాం, మోహన్, ప్రసాద్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు క్యాష్ రివార్డ్



క్యాష్ రివార్డు అందుకుంటున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న రూ.20లక్షల విలువైన గంజాయిని పట్టుకున్న నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ టీంకు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి అభినందించి క్యాష్ రివార్డును అందజేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని డైరెక్ట రేట్ కార్యాలయంలో నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ సీఐ స్వప్నతోపాటు టీంకు రూ.30వేల క్యాష్ రివార్డును కమలహాసన్ రెడ్డి అందజేశారు. అందులో రూ.10వేల క్యాష్ రివార్డును సీఐ స్వప్నకు, రూ.20వేల క్యాష్ రివార్డును ఎన్ ఫోర్స్ మెంట్ టీంకు అందజేశారు. ఈనెల 11న బాన్సువాడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంసాగర్ వద్ద 91 కిలోల గంజాయిని పట్టుకున్నందుకు నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ టీంకు క్యాష్ రివార్డుతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషీ, నిజామాబాద్ డీసీ సోమిరెడ్డి, ఎన్ ఫోర్స్ మెంట్ టీం పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అంజయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రుద్రూర్ లోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం సభ్యులు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయం యొక్క ఆవశ్యకతను వివరించారు. శాస్త్రవేత్తల ద్వారా రైతులు సమస్యలకు టోల్ ఫ్రీ 1800 125 2175 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ బి. రాజ్ కుమార్, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత, సేద్య శాస్త్రవేత్త ఎన్. స్వప్న, పకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు సత్తుపల్లి అశోక్, ఆకుల గణేష్, కొత్తపల్లి రఘు, జి. పురుషోత్తం, మండల వ్యవసాయ అధికారిణి రమ్యశ్రీ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వినయ్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన ఒకరికి జైలు శిక్ష

- 12మందికి జరిమానా

నవతెలంగాణ-కంఠేశ్వర్

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జగన్ శిక్ష 12 మందికి జరిమానా విధించినట్లు నిజామాబాద్ ట్రాఫిక్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందికి ట్రాఫిక్ ఏసిపి టి.నారాయణ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్సై చంద్రమోహన్ ఫిబ్రవరి 14న శుక్రవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ముందర హాజరుపరచగా 12 మందికి 17వేల జరిమానా విధించారు. నగరంలోని ముదిరాజ్ వీధికి చెందిన జి.బాలకృష్ణ తండ్రి అశోక్ అను వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష పడిందని ఎస్ఐ తెలిపారు.

వీర సైనికులకు ఘన నివాళులు

- ప్రదర్శనతో అకట్టుకున్న విద్యార్థులు



పుల్వామ ఘటనపై ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ విద్య సాయి ఉన్నత పాఠశాలలో శుక్రవారం 2019 సంవత్సరంలో పుల్వామాలో పాకిస్తాన్ ముష్కరుల దాడి ఘటనలో మరణించిన వీర సైనికులకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ దేశానికి సైనికులు చేస్తున్న సేవలు మరువలేనివని అని అన్నారు. కుటుంబాలను విడిచి, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సైనికులు దేశానికి సేవ చేయడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. దేశంలోని ప్రతి ఒక్కరు దేశాన్ని ప్రేమించాలని, దేశ సైనికులను గౌరవించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు పుల్వామా ఘటనను ప్రదర్శన రూపంలో అద్భుతంగా ప్రదర్శించి అకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

3
నవతెలంగాణ
కామారెడ్డి
శనివారం | ఫిబ్రవరి 15, 2025 | www.navatelangana.com

ఇసుక టిప్పర్లు పట్టివేత

● పోలీస్ స్టేషన్‌కు తరలింపు



నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జానకంపేట్, ఎడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం అధిక లోడుతో బోధన్ నుంచి నిజామాబాద్ వైపు అధిక లోడ్‌తో వెళు తున్న రెండు ఇసుక టిప్పర్లను అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పట్టుకున్నారు. జానకంపేట్‌లో పట్టుకున్న ఇసుక టిప్పర్‌ను ఆరవ టౌన్‌కు తరలించగా, ఎడపల్లి మండల కేంద్రంలో పట్టుకున్న ఇసుక టిప్పర్‌ను ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు ఇసుక టిప్పర్‌లకు వేబిల్లు ఉన్నప్పటికీ పరిమితికి మించి లోడుతో వెళుతున్న టిప్పర్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఉప వైద్యాధికారి

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం బోధన్ ఉప వైద్యాధికారి డా.సమత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశావర్కర్ల పనితీరు, వైద్య సిబ్బంది పనితీరుపై పీహెచ్‌సీ వైద్యులు డా.రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ఫార్మాసిస్టు రమణకుమార్, స్టాఫ్‌నర్సు అలివేలి మంగ, ఆయూష్ సిబ్బంది ఆస్మా ఉన్నారు.



తనిఖీ చేస్తున్న ఉప వైద్యాధికారి

ప్రజారోగ్య సమస్యలపై
ప్రజల్లో అవగాహన కల్పించాలి

● జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

కాలానుగుణ వాతావరణ పరిస్థితుల మార్పులకు అనుగుణంగా రానున్న వేసవికాల పరిస్థితుల దృష్ట్యా సంభవించే ఆరోగ్య సమస్యలను నివారించడానికి తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అధ్వర్యంలో జాతీయ వాతావరణ మార్పుల ఆరోగ్య సమస్యల నియంత్రణ కార్యక్రమంలో భాగముగా శుక్రవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కరపత్రాలు, గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగ్వాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో క్షేత్ర స్థాయిలో ప్రతి మండల, గ్రామ పంచాయతీల వారీగా తీవ్రమైన ఎండల వల్ల సంభవించే వడ దెబ్బ తదితర అత్యవసర ప్రజారోగ్య సమస్యల గురించి ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తీవ్రమైన వేడి వల్ల వచ్చే వడ దెబ్బ, ఇతర ఆరోగ్య సమస్యలు సంభవించినప్పుడు వెంటనే స్పందించాలని సూచించారు. శుక్రవారం ఆవిష్కరించిన గోడ ప్రతులను, కర పత్రాలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.చంద్రశేఖర్, ఎన్.సి.డి.ప్రోగ్రాం అధికారి డా.శిరీష, వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.విద్య, అదనపు జిల్లా వైద్యాధికారి డా.ప్రభు, దయా కిరణ్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎన్.భీమ్ కుమార్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

వాటరింగ్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలి..

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో శానిటేషన్, పార్కుల నిర్వహణ, వాటరింగ్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని పంచముఖి హను మాన్ కాలనీలోని పార్క్‌ను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. తొలుత పార్కును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో పార్కులను అభివృద్ధి పరచాలని, పిల్లలు ఆదుకునేందుకు పరికరాలు ఏర్పాటు చేయాలని, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్క్‌లలో మొక్కలు నాటి సంరక్షించాలని, గతంలో నాటిన మొక్కలకు వాటరింగ్ నిర్వహించాలని తెలిపారు. పార్కుల అభివృద్ధికి ఆయా వార్డుల్లోని వెల్ఫేర్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్‌ల సహకారం తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ అధికారులు పార్కుల అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని, షేడ్ కోసం గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణ రోజు వారీ నిర్వహించాలని, పట్టణంలో చెత్త కుప్పలు కనబడుతున్నాయని తెలిపారు. పట్టణాన్ని సుందరంగా ఉంచే విధంగా ప్రణాలికలు తయారు చేయాలని అన్నారు. మోడల్ పార్కులను తయారు చేయాలని, పార్కుల వద్ద విద్యుత్ బల్బ్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. పట్టణంలో మున్సిపల్ ద్వారా చేపడుతున్న శానిటేషన్ పనులు, వాటరింగ్, పార్కుల అభివృద్ధి పనుల వివరాలు రోజువారీగా సమర్పించాలని తెలిపారు. అనంతరం పార్క్‌లో కలెక్టర్ మొక్కను నాటి, నీళ్ళ పోశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, ఏఈ శంకర్, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతీ శుక్రవారం వాటరింగ్ డే తప్పనిసరిగా నిర్వహించాలి

ప్రతీ శుక్రవారం వాటరింగ్ డే కార్యక్రమాన్ని తప్పని సరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం స్థానిక కళాభారతి ముందుగల మొక్కలకు నీటిని పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ శుక్రవారం మొక్కలకు నీటిని పోయాలని, ముఖ్యంగా ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా నాటిన మొక్కలు, చెట్లకు నీటిని పోయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పార్క్‌లు, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు వాటరింగ్ చేయాలని మున్సిపల్ సిబ్బందికి తెలిపారు.

బ్రహ్మోత్సవ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని బసవతారక్‌నగర్‌లోని శ్రీ కోట మైసమ్మ సహిత లక్ష్మీనరసింహస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల పోస్టర్లను శుక్రవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, తహసీల్దార్ విఠల్ ఆవిష్కరించారు. మార్చి 4న 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు, సుదర్శన యాగం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పసులేటి గోపికిషన్ తెలిపారు. మార్చి 5న రథోత్సవం ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కోనేటి కృష్ణ, సుదర్శన్, గౌతమ్, విజయ్, లింగం, కుమార్, గోవింద్, కిషోర్, అప్పాజీ, కిషోర్, కృష్ణ, లోకేష్, రాజేశ్వర్, ఆనంద్, పరమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ ఎమ్మెల్యే ఇంటికి బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్

నవతెలంగాణ-జుక్కల్

బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ వైన్ ఓవెన్, సలహాదారు నళిని రఘురామన్ శుక్రవారం హైదరాబాద్‌లోని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా బ్రిటిష్ హై కమిషనర్ గారెత్ మాట్లాడుతూ.. రాష్ట్ర రాజకీయాలు, జాతీయ, అంతర్జాతీయ విషయాలపై చర్చించారు. జుక్కల్ నియోజకవర్గంలో పెట్టుబడులు పెట్టాలని, అంతర్జాతీయ పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి కల్పనకు కృషి చేయాలని, అదేవిధంగా జుక్కల్ నియోజకవర్గానికి రావాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు కోరారు. గారెత్ వైన్ ఓవెన్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విందులో పాల్గొన్న బ్రిటీష్ హైకమిషనర్

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బాధిత కుటుంబాలను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త కృష్ణ క్లాత్ స్టోర్ బట్టల దుకాణం జనార్ధన్ యజమాని మృతిచెందడంతో జనార్ధన్ కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాలరాజు తల్లి రుక్మవ్వ మృతి చెందడంతో శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వీరి వెంట ఎల్లారెడ్డి మాజీ జడ్పీటీసీ సామేల్, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ సుఖేందర్‌రెడ్డి, మహేందర్, పోశెట్టి, సత్యనారాయణ, మాసానిపల్లి మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి తదితరులున్నారు.

యుద్ధభేరి పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-విలేకరుల బృందం

జుక్కల్ :యునైటెడ్ పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా మార్చి 2న తలపెట్టిన చలో ధర్నా యుద్ధభేరి పోస్టర్‌ను శుక్రవారం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్ సిపిఎస్‌ఈయు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కుంట ఎల్లారెడ్డి, జిల్లా ఉపాధ్య క్షులు మోహన్, మండల అధ్యక్షులు సునీల్ పాటిల్, మండల ప్రధాన కార్యదర్శి గాజుల సంతోష్, సీనియర్ ఉపాధ్యాయులు లాలయ్య, ఎల్.ఎన్.గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి :టిఎస్‌సిపిఎస్‌ఈయు తాడ్వాయి శాఖ అధ్యక్షులు గిర్మ బోయ్ ఆధ్వర్యంలో యుపిఎస్‌పై యుద్ధభేరి పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. మార్చి 2న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద యుపిఎస్‌పై జరిగే యుద్ధభేరికి మండలంలోని ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంకల్, కృష్ణజివాడి, బ్రాహ్మణపల్లి, దేమీకలాన్, నందివాడ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, సాహిత్య బాధ్యులు, విజయ వర్ధన్, శ్రీనివాస్ గౌడ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి :యుపిఎస్‌పై యుద్ధభేరి పోస్టర్‌ను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్‌సిపిఎస్‌ఇయు జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల భాస్కర్ రెడ్డి యుపిఎస్ విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రంగా వెంకటేశ్వర్ గౌడ్, గాంధారి మండల అధ్యక్షులు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ రాథోడ్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయి : పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న టిఎస్‌సిపిఎస్ సభ్యులు



గాంధారిలో..

కస్తూర్బాను సందర్శించిన తహసీల్దార్



కస్తూర్బాను సందర్శిస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను తహసీల్దార్ శ్రావణ్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకురాలు శ్యామలకు సూచించారు. విద్యార్థులకు అందించే బియ్యం నిల్వలు, స్టాకు నిలువలను ఆయన పరిశీలించారు. కోడిగుడ్లను శుభ్రమైన స్థలాల్లో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా జాగ్రత్తగా తీసుకోవాలని ఆయన అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన సూచించారు. వంటలు చేసే సమయంలో వంట సామగ్రి శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ రవికుమార్, పాఠశాల ప్రత్యేక అధికారిని శ్యామల, ఉపాధ్యాయులు శిల్ప, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న విద్యార్థులు, పాఠశాల బృందం

నవతెలంగాణ-పిట్లం/లింగంపేట్

మండల కేంద్రంలోని రిచ్ మైండ్స్ పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పుల్వామా అమరవీరులకు శుక్రవారం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లో చనిపోయిన సైనికుల ప్రతి రక్తపు బిందువు రుణం తీర్చుకోలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కిషన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ :పుల్వామా దాడిలో అమరులైన అమరవీరులకు శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్కే పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అమరవీరులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

స్వాములకు భిక్ష



భిక్షలో పాల్గొన్న స్వాములు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని కొడిచర గ్రామం శివ స్వాముల సన్నిధానం వద్ద పీఠాపూజాలో సుధాకర్ పటేల్ పాల్గొన్నారు. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద మండలాల శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

బోధన్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 18న మండల స్థాయి క్విజ్ పోటీలు

నవతెలంగాణ-బోధన్

ఈ నెల 18వ తేదీన బోధన్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈఓ కార్యాలయం హాల్‌లో మండల స్థాయి క్విజ్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు నగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున బోధన్, సాలూర మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి అన్ని మీడియంల నుంచి కేవలం ఐదుగురు విద్యార్థులతో కూడిన ఒక జట్టుకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. పోటీలలో కేవలం పదవ తరగతికి సంబంధించిన అన్ని సబ్జెక్టులతో పాటు జీ.కే, క్రీడలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయన్నారు. గెలుపొందిన వారి పాఠశాలకు బోధన్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేయబడతాయని తెలిపారు. పోటీలు బోధన్ మండల విద్యాశాఖ సహకారంతో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కావున బోధన్, సాలుర మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. 17వ తేదీ వరకు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ముత్యాల నగేష్ ఫోన్ 9010700210 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రైతులతో నాయకుల చర్చ



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామం లోని వ్యవసాయ రోడ్లతో పాటు గ్రామంలోని రోడ్ల మరమ్మ తులపై గ్రామంలోని కాంగ్రెస్ నాయకుల తో పాటు మండల నాయకులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించారు. గ్రామ ంలో మట్టి రోడ్లతో పాటు సీసీ డ్రైనేజీ పనులను వారు పరిశీలించారు. వీటన్నింటినీ మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి గ్రామంలోని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబీన్‌ఖాన్ స్పష్టం చేశారు. ఆయన వెంట మండల నాయకులు సాయిరెడ్డి, ఆగంటి సురేందర్‌గౌడ్, ఎమ్మెల్ రాజు, గంగాకృష్ణ, గ్రామ అధ్యక్షులు సోక్కుల సాయిలు, గోసుల గంగాకిషన్ రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని పేపర్‌మిల్లు గ్రామానికి చెందిన అబ్బోల్ల శ్రీకాంత్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనివార్య కారణాలతో పార్టీని వదిలివెళ్ళిన ఆయన తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆయన వెంట అసెంబ్లీ యూత్ కన్వీనర్ కార్తీక్ యాదవ్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గైని కిరణ్, శ్రీకాంత్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-గాంధారి

34వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు కామారెడ్డి జిల్లా బాలబాలికల జట్టును శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాంధారిలో ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగా వేంకటేశ్వరగౌడ్ తెలిపారు. బాల బాలికలకు అండర్ 16 విభాగంలో జిల్లా నలుమూలల నుంచి బాలురు 65, బాలికలు 50 పాల్గొన్న క్రీడాకారుల్లో ఉత్తమ క్రీడా ప్రదర్శన చేసిన 12 మందిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 20 నుంచి వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్టు కామారెడ్డికి ప్రాతినిధ్యం వహిస్తుందని ఆయన తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బాణాల భాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్ రాథోడ్, రాజు, సంజీవ్, బాలకృష్ణ, అశ్విన్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన బాలుర జట్టు..

అర్జున్, డోలాజీ, సాయికిరణ్, అరుణ్, గణేష్, మధు, ప్రణీత్, మహేందర్, రామ్‌చరణ్, దీపక్, శశిన్ కుమార్

ఎంపికైన బాలికల జట్టు..

ఉష, కీర్తన, రిషిక, నవ్యశ్రీ, ఆస్విత, హారిక, షరోన్, ప్రియాంక, ఆరాధ్య, అస్మిత, వర్షిత, అంజలి ఎంపికయ్యారు.

ఆర్‌టిఐ క్యాలెండర్ ఆవిష్కరించిన సబ్ కలెక్టర్

నవతెలంగాణ-బోధన్

రైట్ టు ఇన్ఫర్మేషన్ (సమాచార హక్కు చట్టం) క్యాలెండర్‌ను శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. సహ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా ప్రజా అవసరాల కోసం సద్వినియోగం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బుజంగ లింగం, సహాయ కార్యదర్శి గిరిధర్, ఉపాధ్యక్షులు సాయి కిరణ్ యాదవ్, జిల్లా సలహాదారులు పావులూరి సాంబశివరావు, కార్యనిర్వాహక కార్యదర్శి రామకృష్ణ, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు సలీం, బోధన్ డివిజన్ అధ్యక్షులు పురం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విధాన సభలో ప్రశ్నించే గొంతుకలుండాలి

● పార్లమెంటు సభ్యులు, జాతీయ ఓబీసి అధ్యక్షుడు లక్ష్మణ్



మట్లాడుతున్న జాతీయ ఓబీసి అధ్యక్షులు లక్ష్మణ్

నవతెలంగాణ-కామారెడ్డి

విధాన సభలో ప్రశ్నించే గొంతుకలుండాలని పార్లమెంటు సభ్యులు, జాతీయ ఓబీసి అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యక్రమంలో టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల సమావేశాన్ని నిర్వహించారు. కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి హాజరైన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ ఓబీసి అధ్యక్షుడు లక్ష్మణ్ హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి ఎమ్మెల్యేగా బీజేపీ పార్టీ అభ్యర్థి వెంకటరమణారెడ్డిని గెలిపించి చరిత్ర సృష్టించారన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని ఆలోచించి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పాల్గొని ఓటు వేయాలన్నారు.

కందకుర్తిలో భక్తుల కిటకిట

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం వద్ద శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు గోదావరిలో స్నానాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మున్సిపల్ కార్యాలయంలో ఈకేవైసీ క్యాంపు


ఈకేవైసీ నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

సిడిఎంఏ ఆదేశానుసారం శుక్రవారం పట్టణ మున్సిపల్ కార్యాలయంలో సెప్టిక్ ట్యాంక్ వర్కర్స్‌కు (నేషనల్ యాక్షన్ ఫర్ మెకానైజేడ్ శానిటేషన్ ఈకో సిస్టం) స్కీంలో భాగంగా ఈ కేవైసీ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, సిఎస్ సీ ఆపరేటర్ దేవేందర్, సెప్టిక్ ట్యాంక్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


పుస్తకాలు వితరణ చేస్తున్న ప్రవీణ్ శర్మ

నవతెలంగాణ-ఏర్గట్ల

జాతీయ పుస్తక వితరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అందులో తెలుగు పండితునిగా సేవలందిస్తున్న ప్రవీణ్ శర్మ 6000 రూపాయల విలువగల పుస్తకాలను పాఠశాల గ్రంథాలయానికి వితరణ చేశారు. విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను అందజేసిన ప్రవీణ్ శర్మను ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరగాళ్ల హింసలు సహించం

- బార్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్ హెచ్చరిక
- న్యాయమూర్తిపై దాడికి నిరసనగా విధులు బహిష్కరించిన న్యాయవాదులు


కంఠేశ్వర్: మాట్లాడుతున్న బార్ అధ్యక్షులు జగన్మోహన్ గౌడ్


ఆర్మూర్‌లో

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

నేరాలలో నేర నిరూపణ అయిన దోషులు న్యాయమూర్తుల పట్ల హింస ప్రవృత్తితో ప్రవర్తించడాన్ని సహించబోమని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లాకోర్టులో అదనపు జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న హరీష్‌పై ఒక కేసులో నేర నిర్ధారణ అయిన దోషి ఒక వస్తువుతో దాడికి పాల్పడడం ఆందోళనకరమని ఆయన అన్నారు. సదరు నేర ఘటనను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ పిలుపు మేరకు జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్‌లో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో ఇలాంటి నేరపూరిత ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళ న్యాయమూర్తిపై దాడి న్యాయవ్యవస్థ పై దాడిగా ఆయన అభివర్ణించారు. న్యాయమూర్తులకు అండగా న్యాయవాద సమాజం ఉంటుందని అన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు తమ పరిధిలో న్యాయం సమపాళ్ళలో అందే విదంగా శ్రమిస్తారని పేర్కొన్నారు. న్యాయస్థానాలలో నేర న్యాయ విచారణకు హాజరయ్యే నేర చరితగల ముద్దాయిల పట్ల కోర్టు భద్రత సిబ్బంది తగు జాగ్రతలతో వ్యవహరించాలని జగన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నేరమయ ముద్దాయిల పట్ల ముందస్తుగా సమాచారం తీసుకుని కోర్టులోకి భద్రత సిబ్బంది అనుమతించాలని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు ఎర్రం గణపతి, తుల గంగాధర్,గంగ ప్రసాద్,ఆశ నారాయణ, మద్దెపల్లి శంకర్ లు మాట్లాడుతు న్యాయమూర్తులు తమ విధినిర్వహణలో చట్ట ప్రకారమే వ్యవహరిస్తారని తెలిపారు.సమావేశంలో పాల్గొన్న న్యాయవాదుల ఏకాభిప్రాయం మేరకు శుక్రవారం కోర్టుల విధులకు హాజరుకాకుండా నిరసన వ్యక్తం చేశారు.సమావేశంలో బార్ ఉపాధ్యక్షుడు పెండెమ్ రాజు,కార్యదర్శి సురేష్ దొన్పల్, న్యాయవాదులు దీపక్ మానిక్ రాజు, బాగిర్తి సాయిరెడ్డి, సదానంద్ గౌడ్,రత్నాకర్ రెడ్డి, విగ్నేష్,తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జీ జిల్లాజడ్జికి వినతిపత్రం....

జిల్లాకోర్టు ప్రాంగణంలోని రెండవ అంతస్తులోని ఒక కోర్టు గది వద్ద అపరిచిత వ్యక్తుల చర్యలు అపాయకరంగా ఉన్నాయని, న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న నిమ్మకాయలు, పసుపు, కుంకుమ చల్లే చర్యలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని బార్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్ ఇంచార్జి జిల్లాజడ్జి కనక దుర్గ కు వినతి పత్రం అందజేశారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

ఆర్మూర్: జీవిత ఖైదు అనుభవిస్తున్న ముద్దాయి దాడి చేయడాన్ని శుక్రవారం బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈసందర్భంగా అధ్యక్షులు తెడ్డు నర్సయ్య మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా కోర్టు కాంప్లెక్స్ తొమ్మిదవ అదనపు జిల్లా మహిళా న్యాయమూర్తి పై జీవిత ఖైదీ దాడిచేయడంపై నిరసన తెలిపారు. ఈ సందర్బంగా అధ్యక్షులు మాట్లాడుతు.. ముద్దాయిని కఠినంగా శిక్షించాలని ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం కోర్టు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ డి.అరుణ్ కుమార్ న్యాయవాదులు పండిత్ కృష్ణ, గంగారెడ్డి, తులసి దాస్, జగన్, నరేందర్, రమేష్, శ్రీధర్, జగదీష్, గంగాధర్, అశోక్, దేవన్న, విజయలక్ష్మి, శ్యామ్, గణేష్, రాకేష్, కిరణ్, శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

సర్వే రెమ్యూనరేషన్ అందజేయాలి

- అధికారులకు వినతి పత్రాలు అందజేత


వినతిపత్రాలు అందజేస్తున్న ఎస్‌జిటి యూనియన్ సభ్యులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలో 2024 నవంబర్ నెలలో ఉపాధ్యాయులు కుల గణన సర్వే యొక్క రెమ్యూనరేషన్ అందజేయాలని ఎస్‌జిటి యూనియన్ సభ్యులు కోరారు. ఇంటింటి కుటుంబ సర్వే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో చేయించారని, దాని రెమ్యూనరేషన్ ఇప్పటివరకు అందలేదని అన్నారు. ఎంపీడీవో, ఎమ్మార్వో, ఎంఈఓ. లకు శుక్రవారం సెకండరీ గ్రేడ్ టీచర్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. అతి తొందర్లో రెమ్యూనికేషన్ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ జి టి యూనియన్ కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. పట్టణంలోని శుక్రవారం చీమన్‌పల్లి గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, హౌసింగ్ బోర్డు సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను, పిప్రి రోడ్డులోగల సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలను, వేల్పూర్ సాంఘిక సంక్షేమ పాఠశాలను, పెర్కిట్‌లోని కేజీబీవీ పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) శ్రీ అంకిత్, స్థానిక మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వంట గదులు శుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేయాలని, సరుకులను తగు జాగ్రత్తలు పాటిస్తూ నిలువ చేసుకోవాలని, బాత్రూమ్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి, భోగ్ బండారు నిర్వహించాలి

- లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మోహన్
- ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న లంబాడి సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించాలని, భోగ్ బండార్ కార్యక్రమాలు అందరి సమక్షంలో నిర్వహించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతి పత్రం సమర్పించినట్లు జిల్లా లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మోహన్ తెలిపారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న అధికారికంగా జరిపే జయంతి ప్రతి తండా నుంచి ప్రతి బంజారా బిడ్డలను భాగస్వామ్యం చేసి మండలంలో జరిగే ఈ ప్రోగ్రాంలో ప్రతి బంజారా బిడ్డలను కలుపుకొని పోవాలని కచ్చితంగా భోగ్ బండారు కార్యక్రమాలను అందరి సమక్షంలో నిర్వహించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసి కోరారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చౌహన్ మోహన్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు విట్టల్ నాయక్, జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ రవి నాయక్, రూరల్ ఇంచార్జి సరిచంద్ నాయక్, భీంగల్ మండల యూత్ అధ్యక్షులు భూక్యా రమేష్ నాయక్, ధర్పల్లి యువ నాయకులు హంసర్ నాయక్ ప్రతి సంవత్సరం15న ఫిబ్రవరి సంత్ సేవాలల్ మహారాజ్ జయంతి నిర్వహించాలని తెలిపారు.

బ్రహ్మోత్సవం ప్రారంభం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులోగల శ్రీ అపురూప వెంకటేశ్వర స్వామి 13 వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఆలయ కమిటీ ఆద్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, తదితర కార్యక్రమాలు నిర్వంహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు అమృతలత రెడ్డి, సభ్యులు ప్రభ దేవి, రమణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన


బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ విద్యాసాయి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని నాగారంలోని రాజారాం స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అండర్ 14, అండర్ 16 బాలుర విభాగాల్లో రన్నింగ్, షాట్ పుట్, లాంగ్ జంప్ లో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్ షిప్ లో ద్వితీయ స్థానాన్ని సాధించారు. అదేవిధంగా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తూమ్ శివచరణ్ జిల్లా స్థాయిలో అండర్-16 షాట్ పుట్ బాలుర విభాగంలో ప్రథమ బహుమతిని గెలుపొందాడు. ఆయా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులతోపాటు తూం సాయిచరణ్‌లను విద్యా సాయి పాఠశాల చైర్మన్ ఏనుగు గంగారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. నెల 18,19 ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల చైర్మన్ ఏనుగు గంగారెడ్డి తెలిపారు. శివ చరణ్ రాష్ట్ర స్థాయికి ఎంపిక అవ్వడంతో తల్లిదండ్రులు ఆనంద వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కోఆర్డినేటర్ జాను సుందర్, పవన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మాధవన్న పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 16న సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ లో జరిగే మాధవన్న పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయండని మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి రమేష్ అన్నారు. గొర్రెపాటి మాధవరావు తన జీవితాంతం మానవ హక్కుల కోసం, బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పోరాడారని, బాధితులకు కోర్టుల్లో కేసులు వేసి మాధవరావు నష్టపరిహారం ఇప్పించారని తెలిపారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభ వాల్ పోస్టర్లను ఎల్లమ్మ గుట్ట కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక (హెచ్ ఆర్ ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది జి. రమేష్ మాట్లాడుతూ.. గొర్రెపాటి మాధవరావు పీడిత ప్రజల కోసం, నిర్వాసితుల కోసం, ఆదివాసీల కోసం పోరాడారని చెప్పారు. ఎక్కడ హక్కుల హననం జరిగితే అక్కడ మాధవరావు ఉండేవారని, హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసే వారని తెలియజేశారు. అనేక అంశాల మీద పుస్తకాలు వ్రాసి, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశారని చెప్పారు. రాష్ట్రస్థాయి సంస్మరణ సభలో ప్రజా హక్కుల న్యాయవాది గొర్రెపాటి మాధవరావు అనే పుస్తకాన్ని రిటైర్డ్ జడ్జి సుదర్శన్, సీనియర్ హైకోర్టు న్యాయవాది నందిగం కృష్ణారావు ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు రిటైర్డ్ జడ్జి వై.కృష్ణ గోపాలరావు, కోశాధికారి ఆకుల సత్యనారాయణ, న్యాయవాదులు గగన్ అన్వేష్ బస పవన్ ప్రసాద్, మాధవన్న కూతురు మధుమిత పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆదర్శాలను బడ్జెట్ కేటాయింపుల్లో ఆవిష్కరించాలి

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యం.యాదగిరి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ యం. యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారత రాజ్యాంగ ఆదర్శాలైన పేదరిక నిర్మూలన, ఆర్థిక సమానతలు రూపుమాపడం, నిరుద్యోగం నిర్మూలించడం, అక్షరాస్యత శాతాన్ని పెంచడం, సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసి సమ సమాజాన్ని స్థాపించడం కోసం బడ్జెట్లో కేటాయింపులు ఉండాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్.యం యాదగిరి పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ లో అప్లైడ్ ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఏ.పున్నయ్య అధ్యక్షత 2025-26 కేంద్ర బడ్జెట్ పై జరిగిన చర్చలో భారత ఆర్థిక వ్యవస్థ పై కేంద్ర బడ్జెట్ యొక్క ప్రభావం అనే అంశంపై రిజిస్ట్రార్ ప్రసంగించారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ అనేక అడ్డంకులను అధిరోహించుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు పోతుందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఒకవైపు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత నిస్తూనే, పారిశ్రామిక, సేవల రంగాలను వేగంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నాయన్నారు. రెవెన్యూ రాబడి కంటే రెవెన్యూ వ్యయం అధికంగా ఉన్నదని దీనిని తగ్గించుకోవాలని సూచించారు. మూలధన వ్యయం ఏ దేశంలోనైతే అధికంగా ఉంటుందో ఆ దేశం ప్రగతి పథంలో ముందుకు దూసుకుపోతుందని పేర్కొన్నారు. ఖాయిలా పడిన పరిశ్రమల సమస్యలను డిజ్ ఇన్వెస్ట్మెంట్ ప్రక్రియ ద్వారానో, పబ్లిక్, ప్రైవేట్ పార్ట్నర్షిప్ ద్వారానో పరిష్కరించి దేశాభివృద్ధికి దారులు పడే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో పన్నుల వ్యవస్థలో సంపూర్ణమైన సంస్కరణలు తీసుకురావాలన్నారు. అనేకమంది పన్ను చెల్లింపు దారులు తమ ఆదాయాలను చూపకపోవడం ద్వారా చట్టబద్ధంగా ప్రభుత్వానికి రావలసిన ఆదాయాలు ప్రభుత్వానికి దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ ఆరతి, కామర్స్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ రాంబాబు గోపిశెట్టి, మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ సిహెచ్ ఆంజనేయులు, అప్లై ఎకనామిక్స్ ప్రొఫెసర్ కే రవీందర్ రెడ్డి, డాక్టర్ స్వప్న, డాక్టర్ సంపత్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఫ్యాకల్టీ మెంబర్స్ డాక్టర్ రామలింగం, డాక్టర్ నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

- వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కలిపించాలి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మెదక్ జిల్లా చేగుంట మండలం మక్క రాజుపేట కాంప్లెక్స్ పరిధిలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిఆర్పిలు శ్రీనివాస్ రమేష్ విధులు ముగించుకొని ఎమ్మార్సీ చేగుంటకు చేరుకునే క్రమంలో కల్నాల్‌పల్లి వద్ద ఆటోను ఢీ కొట్టి మృతి చెందారని సిఆర్‌పీలు నరేందర్, సంతోష్ బాలరాజ్, మిస్ రవి బాబు సి ఓ నరేష్, ఐఇ ఆర్పీలు జెలందర్, కిషన్ తెలిపారు. ప్రభుత్వం వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అంత్యక్రియల ఖర్చులు కూడ ప్రభుత్వమే భరించాలన్నారు.

కన్నుల పండువగా మంథని శ్రీ రంగనాయక స్వామి జాతర



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మంథని శ్రీ రంగనాయక స్వామి జాతర ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి జాతర ఉత్సవాలు 120 సంవత్సరాలు నుంచి జరుగుతున్నట్లు ఆలయ అర్చకులు శుక్రవారం తెలిపారు. ప్రతి ఏటా మాఘ పౌర్ణమిలో మూడు రోజుల పాటు జాతర రథోత్సవం జరుగుతుందని వేద పండితులు జాతర విశిష్టతను భక్తులకు తెలిపారు. జాతర లో పాల్గొనేవారు 11 రోజులపాటు దీక్ష చేపట్టి నియమనిష్టలతో స్వామివారిని పూజిస్తారని చెప్పారు. జాతర మహోత్సవాన్ని చూసేందుకు చుట్టుపక్కల జిల్లా నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. జాతరలో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

జెడ్పిహెచ్‌ఎస్ బినోలా విద్యార్థినికి డిఈఓ ప్రశంస

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా విద్యాశాఖాదికారి పి.అశోక్ బినోల ఉన్నత పాఠశాల విద్యార్థిని కన్నం భవాని ని, గైడ్ ఉపాధ్యాయురాలు టి.సరిత ను, పాఠశాల హెచ్‌ఎం మోహన్ రెడ్డి ని, ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బినోల ఉన్నత పాఠశాల విద్యార్థిని కన్నం భవాని అడిగిన ప్రశ్నకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నుండి పరీక్షపే చర్చ కు జవాబు ఇచ్చారు అని తెలిపారు. భారతదేశంలో కొంతమంది విద్యార్థులకు మాత్రమే వచ్చే ఈ అవకాశం మన జిల్లా విద్యార్థినికి రావడం సంతోషం అని అన్నారు.

ప్రజా ఉద్యమాలకు దిక్సూచి కామ్రేడ్ యాదగిరన్న

- జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజా ఉద్యమాలకు కామ్రేడ్ యాదగిరన్న దిక్సూచి లాంటి వాడని ఆదర్శ కమ్యూనిస్టు, నిజాయితీ పరుడు, నిరాడంబరుడు, సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన కామ్రేడ్ యాదగిరి కమ్యూనిస్టు శ్రేణులకు ఆదర్శమని, ఆయన మరణం పీడిత ప్రజలకు తీరని లోటని అత్యంత త్యాగపూరిత జీవితం ఆయనదని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా నిజామాబాద్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పేర్కొన్నారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ యాదగిరన్న సంతాప సభను నిజామాబాద్ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో శుక్రవారం డిచ్ పల్లి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పాల్గొని మాట్లాడుతూ జీవితాంతం ఆదర్శంగా నిలిచి, మరణించిన తర్వాత కూడా తన శరీరాన్ని, నేత్రాలను దానంచేశారని, కామ్రేడ్ యాదగిరి నిజామాబాద్ జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారని అన్నారు. ఆయన ఆశయాల సాధనలో చైతన్య స్ఫూర్తిగా ప్రజా ఉద్యమాలను నిర్మించాలన్నారు. అదే కామ్రేడ్ యాదగిరికి నిజమైన నివాళి అని అన్నారు. ఈ సంతాప సభకు సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి వెంకన్న అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి సాయన్న, సీఎల్సీ జిల్లా కార్యదర్శి అల్గోట్ రవీందర్, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు సుధాకర్, కిషన్, మండల కార్యదర్శి మురళి, లలిత, పివైఎల్ డివిజన్ ఉపాధ్యక్షులు మోహన్, పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేష్, పివైఎల్ డివిజన్ అధ్యక్షులు సాయిబాబా, సాయి రెడ్డి, రాందాస్, అశోక్, ఇంతియాజ్, శ్రీను, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజనం పరిశీలించిన డిఎల్‌పిఓ


భోజనాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం, నర్సరీని డిఎల్‌పీఓ పరిశీలించారు. ఎండాకలం ప్రారంభమవుతున్నందున మొక్కలకు నీరు అందించి కాపాడాలని అన్నారు .విద్యార్థులకు మంచి ఆహారం తో పాటు విద్యను అందించాలని తెలిపారు. వారితో పాటు పంచాయతీ సెక్రటరీ సాయిలు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | ఫిబ్రవరి 15, 2025 | www.navatelangana.com

ఫిబ్రవరి 14.. చీకటి రోజు

నవతెలంగాణ-ముప్కాల్



2019 ఫిబ్రవరి 14న జమ్మూకాశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 40 మంది జవాన్లు వీరమరణం పొందారని, ఆరోజు పుల్వామా రోజుగా, చీకటి రోజుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా అమరులైన జవాన్లకు వమండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నివాళులు అర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం వహించారు. కార్యక్రమంలో ముప్కాల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల నర్సయ్య, ఎస్ఐ రజినీకాంత్, సభ్యులు చాకు లింగం, ముస్కు రాజేశ్వర్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సిద్ధ రమేష్, మునిరోద్దీన్, శ్రీధర్, రఫీ, మాజిత్ తదితరులు పాల్గొన్నారు..

మార్కెట్ యార్డులో సరుకు భద్రం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మార్కెట్ యార్డులో సరుకు భద్రంగా ఉంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ మార్కెట్ యార్డు రాష్ట్రంలోనే అతిపెద్ద రెండవ మార్కెట్‌గా పేరుందని, యార్డునకు అనునిత్యం నిజామాబాద్ జిల్లానుండేగాక పొరుగు జిల్లాల నుండి రైతుసోదరులు సైతం తమ పంట ఉత్పత్తులను విక్రయం నిమిత్తం సరుకును తీసుకువస్తారని పేర్కొన్నారు. యార్డులో రైతుసోదరుల ముందే సరుకును కుప్పలుగా పోసి, తమ సరుకులను ఆన్లైన్ ఇ-నామ్ పద్ధతిపై పూర్తి పారదర్శకతతోనే అమ్మకం జరుగుతుందని తెలిపారు. రైతు సోదరుల ముందే కాంటా చేస్తారని, మార్కెట్ యార్డు సెక్యూరిటీ సిబ్బంది నిఘా ఉంటుందని , యార్డులో ప్రధానమైన కూడలిలో, షెడ్లలో సిసి కెమోరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అంతేగాకుండా సంబంధిత ప్రతి కమిషన్ ఏజెంట్స్ వారి సెగ్మెంట్స్‌లో ఒక్కొక్క కమీషన్ ఏజెంట్, వారి వాచ్మెన్స్ నిఘా ఎప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. రైతుసోదరుల సరుకు మార్కెట్ యార్డులో భద్రంగా ఉంటుందని తెలిపారు.

సంతాప సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-రెంజల్

ఈ నెల 17న నిజామాబాద్ లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో కామ్రేడ్ యాదగిరి అన్న సంతాప సభను విజయవంతం చేయాలని మండలంలోని బోర్గం గ్రామంలో సిపిఐఎంఎల్ ప్రజా పంథా నాయకులు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పుట్టి నడిపి నాగన్న మాట్లాడుతూ.. 54 సంవత్సరాలు ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ సమస్యల పరిష్కరించిన ఘనత యాదగిరి అన్నకే దక్కుతుందని ఆయన అన్నారు. సింగూరి నీటికోసం ఆయన ఎంతో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సేవలు అందించాలన్న తలంపుతో తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి ఉద్యమం చేపట్టారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు పార్వతీ రాజేశ్వర్, వడ్డెన్న, ఎల్.గంగాధర్, ఎస్కే నసీర్, సంతోష్, సిద్ధ పోశెట్టి, సాకలి సాయిలు, సుదర్శన్‌గౌడ్, అమిత్, మౌలా తదితరులు పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీలకు వేతన వెతలు

- ప్రధాన అంగన్వాడీలుగా ఉన్నతీకరించిన పాత వేతనాలే

నవతెలంగాణ-ఏర్గట్ల

బాలబాలికలకు చిన్న వయస్సు నుండే విద్యనందిస్తూ,వారిని పాఠశాలకు అలవాటు చేస్తూ... విద్యార్థులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్వాడీ పాఠశాలలు రాష్ట్రంలోనే గాక దేశంలో ప్రముఖ భూమికను పోషిస్తున్నాయి. ఇదే కాక వారి పనితో పాటుగా ప్రభుత్వం ఎలాంటి సర్వేలు చేపట్టిన అందులో పాల్గొని ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పనిచేస్తున్న అంగన్వాడీ కేంద్రాలు ద్వారా ఆశించిన ఫలితాలు వస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక అంగన్వాడీల్లో మినీ అంగన్వాడీ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ల విషయానికొస్తే, పనిలో ప్రధాన అంగన్వాడీ కేంద్రాలకు తీసిపోకుండా హెల్పర్లు లేకున్నా వారే టీచర్లు, హెల్పర్లుగా రెండు పనులను నిర్వహిస్తూ... అధిక పని భారానికి లోను అవుతున్నారు.ఇది గమనించిన రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం జనవరిలో, మినీ అంగన్వాడీలను ఉన్నతీకరించి, ప్రధాన అంగన్వాడీలుగా మార్చింది. దీని ప్రకారం వారు అందుకునే 7,800 రూపాయల వేతనాన్ని, ప్రధాన అంగన్వాడీ టీచర్లకు ఇచ్చే విధంగా 13,650 రూపాయలు వేతనం పెంచి, మినీ అంగన్వాడీలను ప్రభుత్వం గౌరవించింది.అయితే 13,650 రూపాయలను కేవలం 3 నెలలు మాత్రమే గతేడాది (జనవరి, ఫిబ్రవరి, మే నెలల్లో)పెంచి ఇచ్చారు. మిగిలిన నెలలు మళ్ళీ పాత జీతం 7,800 రూపాయలు అందించడంతో మినీ అంగన్వాడీలు ఆందోళన చెందుతున్నారు. వారి పనికి తగిన జీతం అందకపోవడంతో వారి కుటుంబ జీవన పరిస్థితి దుర్భరంగా మారింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిజామాబాద్ అర్బన్, డిచ్‌పల్లి, బోధన్, ఆర్మూర్, భీంగల్ డివిజన్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 135 మినీ అంగన్వాడీలు ఉన్నాయి. పెరిగిన ధరలతో మా బతుకులు దుర్భరంగా తయారయ్యా యని, ప్రధాన అంగన్వాడీ కేంద్రాలలో లాగా ప్రభుత్వం పెంచిన జీతం 13,650 రూపాయలు ఇచ్చి, శాశ్వత పరిష్కారం చూపి తమను ఆదుకోవాలని, ఆగిన వేతనాలు త్వరగా చెల్లించాలని మినీ అంగన్వాడీ టీచర్లు కోరుతున్నారు.



సమస్య పరిష్కారమవుతుంది

స్వర్ణలత-సీడీపీఓ, భీంగల్ ప్రాజెక్టు అధికారిణి

మినీ అంగన్వాడీ టీచర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.గత సంవత్సరం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ప్రధాన అంగన్వాడీల లాగానే 13,650 రూపాయల వేతనం కచ్చితంగా అందుతుంది. పాత జీతంతో కలుపుకుని ఏడిఎస్ రూపంలో ఆగిన జీతాలు వస్తాయి. ఈ సమస్య సెంట్రల్ లెవల్‌లో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా, ప్రాజెక్టు లెవల్ లేదు.ఈ సంవత్సరం జనవరి వరకు మినీ అంగన్వాడీల జీతాలు వేశారు. ఎప్పటివరకు ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నది కచ్చితంగా చెప్పలేం.

ఏసిబీ కేసులో పంచాయతీ కార్యదర్శికి ఒక సంవత్సరం జైలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

లంచం తీసుకున్న కేసులో గ్రామ పంచాయతీ కార్యదర్శి కి నాంపల్లి ఎసిబి న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. నిజామాబాద్ ఎసిబి డిఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరి మండల కేంద్రానికి చెందిన వడ్డే నర్సింహులు అతని తండ్రి పేరు మీద ఉన్న ఇంటిని తమ సోదరుల పేరు మీదకు బదలాయించాలని గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. నర్సింహులు వద్ద కోటగిరి పంచాయతీ కార్యదర్శి జి . సుధర్శన్ 10 వేల లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని నర్సింహులు ఎసిబిని ఆశ్రయించారు. 2014 ఫిబ్రవరి 21న నర్సింహులు నుంచి .8,000 తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ కేసులో ఏసీబీ అరెస్ట్ చేసిన సుధర్శన్‌పై శుక్రవారం నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో వాదనలు జరిగాయి. ఎసిబి తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తమ వాదనలు వినిపించగా ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్ తమ తీర్పు వెలువరించారు. లంచం తీసుకుంటూ దొరికిన అనాటి కోటగిరి పంచాయతీ కార్యదర్శి జి సుదర్శన్ కు ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా, మరో సెక్షన్ లో రూ.20 వేల జరిమానా విధించారు. మొత్తంగా ఏడాది కాలం జైలు శిక్షతో పాటు రూ.40 వేల జరిమానా చెల్లించాలని లేని యెడల ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కోన్నారు.

దళిత విద్యార్థిపై హత్యాప్రయత్నం చేసిన గుండాలను శిక్షించాలి

- కేవీపీఎస్ వర్ని మండల కన్వీనర్ ఇందూర్ సాయిలు

నవతెలంగాణ-వర్ని

తమిళనాడులోని శివగంగ జిల్లాలో డిగ్రీ చదువుతున్న అయ్య సామి తన బుల్లెట్ బైక్‌పై వెళ్తుండగా అగ్రవర్ణ ముగ్గురు యువకులు దాడి చేసి.. 'తక్కువ కులం వాడివి నువ్వు మా ముందే బుల్లెట్ బైక్ నడుపుతావా..?' అంటూ రెండు చేతులు నరికేయడం దారుణమని, అయ్య సామిపై హత్యాయత్నం చేసిన ముగ్గురు అగ్రవర్ణ యువకులపై హత్యాయత్నం కేసు నమోదుచేసి, కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ వర్ని మండల కన్వీనర్ ఇందూర్ సాయిలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అయ్య స్వామికి ప్రభుత్వం మెరుగైన చికిత్స అందించి, రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే దళిత, బహుజన బిడ్డలను ఏకం చేసి, కేవీపీఎస్ ఆధ్వర్యంలో అయ్యసామికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు.

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్టు

- నాలుగు సెల్‌ఫోన్లు, 900 గ్రాముల గంజాయి పట్టివేత
- వివరాలు వెల్లడించిన నిజామాబాద్ ఏసిపి రాజా వెంకట రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

డిచ్పల్లి లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి నాలుగు సెల్ ఫోన్లు 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ ఏసిపి రాజా వెంకట రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని నిజామాబాద్ ఏసీబీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన వివరాలను నిజామాబాద్ ఏసిపి రాజ వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఈనెల13న నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుండి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయిని తీసుకువెళ్తున్నారనే పక్కా సమాచారంతో డిచ్‌పల్లి ఎస్సై తన సిబ్బందితో మెంట్రాజ్‌పల్లి గ్రామ జంక్షన్ దగ్గర, ఎన్ హెచ్-44 రోడ్డు పైన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసమయంలో టీవీఎస్ స్పోర్ట్స్ బైక్ పైన గంజాయిని తరలిస్తున్న జాదవ్ వంశీ కృష్ణ, ఆకోజి అభిలాష్‌ను పట్టుకున్నారు. జాదవ్ వంశీ కృష్ణ వద్ద 300 గ్రాముల గంజాయి, సెల్ఫోన్, అలాగే అభిలాష వద్ద 200 గ్రాముల గంజాయి, సెల్ఫోన్, మోటార్ సైకిల్ స్వాధీనం స్వాధీనం చేసుకున్నారు. నింధితులు ఏ1, ఏ2 చూపిన ప్రకారం గంజాయిని అమ్మిన వ్యక్తుల పట్టుకొని, గంజాయి అమ్మిన ఏ3 తుకారాం రాథోడ్, ఏ4 తాళ్ల ప్రమోద్‌ను పట్టుకున్నామన్నారు.తుకారాం రాతోడ్ దగ్గర నుండి 200 గ్రాముల గంజాయి మొబైల్, ఏ-4 తాళ్ల ప్రమోద్ నుండి 200 గ్రాముల గంజాయిని, మొబైల్ ఫోను స్వాధీనం చేసుకున్నామన్నారు. పంచనామా అనంతరం డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. మొత్తం నలుగురు నేరస్తులనుండి 900 గ్రాముల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు ఒక మోటార్సైకిల్ సీజ్ చేసి వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామన్నారు. కేసు చేదించడంలో కృషి చేసిన డిచ్పల్లి , సీఐ,ఎస్ హెచ్ ఓ, ఎస్సై వారి సిబ్బందిని అభినందించారు. ప్రజలకు గంజాయా త్రాగడము, అమ్మడము చట్ట రీత్యా నేరము కనుక ఎవరికైనా గంజాయా అమ్మేవారి వివరాలు, గంజాయా త్రాగే వారి వివరాలు తెలిసినచో పోలీస్ వారికి సమచారము ఇవ్వగలరాని తెలిపారు వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ

మహిళా అదృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి



మాచారడ్డి మండలంలో ఇసాయిపేట గ్రామానికి చెందిన దాసరి మమత 26 సంవత్సరాలు కనిపించడం లేదని ఆమె భర్త దాసరి మహిపాల్ ఫిర్యాదు చేసినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపారు. శుక్రవారం ఉదయం మాచరెడ్డి మండలంలోని ఇస్సాయిపేట గ్రామ బస్టాండ్ వద్ద కామారెడ్డి బస్సు ఎక్కి వెళ్లిపోయిందని తిరిగి ఇంటికి రాలేదని ఆమె భర్త మహిపాల్ ఇచ్చిన దరఖాస్తుల పేర్కొని పేర్కొన్నారనీ అన్నారు. మహిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మాచారెడ్డి పోలీసులు తెలిపారు.

శ్రీ అంబరీశ్వర శివ పంచాయతన విగ్రహ మహోత్సవం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని బొంపల్లి గ్రామ స్టేజి వద్ద గల అంబరీషుని గుట్టపైన శుక్రవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి కలశాలతో ఊరేగింపుగా అంబరీషుని గుట్టపైకి కలశాలను తీసుకెళ్లారు. విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శివ గౌడ్, ఉపాధ్యక్షులుగా పసుపు రాజు, కార్యదర్శిగా సుంకరి సాయిలు, క్యాషియర్‌గా మున్నూరు గోపి, కమిటీ సభ్యులుగా సిహెచ్.లింగారావు, పిటి హనుమంత్ రావు, టి.రాములు, కె.మధుసూదన్, మూర్తి, వడ్ల శీను, చాకలి సాయిలు, కె.భాస్కర్, గంగారం, కె.రాజేందర్, గ్రామాభివృద్ధి కమిటీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. కమిటీ అధ్యక్షులు, సభ్యులు మాట్లాడుతూ.. నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని అన్నారు.

లోకల్ వాహనాలను ఉచితంగా పంపించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మండల పరిధిలో ఉన్న లోకల్ వాహనాలను ఉచితంగా పంపించాలని భిక్కనూర్ మండల తుఫాన్ అసోసియేషన్, ట్రాలీ ఆటో టాక్స్ వెహికల్ ఆధ్వర్యంలో టోల్ ప్లాజా యాజమాన్యానికి శుక్రవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా లోకల్ వాహనదారులు మాట్లాడుతూ.. టోల్ ప్లాజా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు లోకల్ వాహనాలకు ఉచితంగానే పంపించారని, ప్రస్తుతం కొత్త టోల్ ప్లాజా కాంట్రాక్టు నిర్వాహకులు లోకల్ వాహనాలకు అనుమతి లేదని తెలపడం సరికాదన్నారు. 20 కిలోమీటర్ల పరిధిలో గల వాహనాలకు ఉచితంగా పంపించాలని లేకుంటే టోల్‌ప్లాజా ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం స్పందించిన టోల్ ప్లాజా యాజమాన్యం అధికారులతో సంప్రదించి వివరాలు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకల్ వాహనదారులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మాలో తండాలో సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీ యుద్దీన్ బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని అన్నారు. ఓడిపోయిన వారు గెలుపు కోసం ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. మారుమూల గిరిజన తండాలో కబడ్డీ టోర్నమెంట్లు నిర్వహించడం ఆర్గనైజర్‌లను అభినందించారు. టోర్నమెంట్‌లో 36 టీములు పాల్గొన్నట్టు తెలిపారు. అందులో ఫస్ట్‌ప్రైస్ మనీ రూ.16,888, పిట్లం టీం బంజారా వారియర్స్ మొదటి బహుమతి గెలుపొందారని పరమళ్ళ తాండ యువకులు రెండో బహుమతి రూ.8888 అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు రమేష్, రవీందర్, గణేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఎనీటైం మద్యం

- తెల్లవారి నుంచి అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు
- పల్లెలు, కాలనీల్లో అందుబాటులో మద్యం
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్ట్ షాపులు
- నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు
- పోలీసులకు సవాల్‌గా బెల్టుషాపుల నిర్వహణ
- బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న వ్యాపారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంతోపాటు, చుట్టుపక్కల వివిధ గ్రామాల్లో బెల్ట్ షాపు దందా జోరుగా సాగుతోంది. అధిక ధరలకు బెల్టు యాజమాన్యాలు జేబులు నింపుకునేందుకు నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. జిల్లా కేంద్రంలోని పలు డివిజన్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపులలో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉదయం నుండి మొదలై రాత్రి వరకు కొనసాగుతున్నాయి. మద్యం అమ్మకాలు ప్రభుత్వ అనుమతితో నడిచే వైన్ షాపులు ఉదయం 10 గంటలు నుంచి రాత్రి పది గంటల వరకు కొనసాగుతాయి. కానీ బెల్ట్ పాపులకు మాత్రం జెండా పండుగ, గాంధీ జయంతి పండుగలు అనే తేడా లేకుండా 24 గంటలు నిజామాబాద్ నగరంలోని పలు డివిజన్ల తోపాటు చుట్టుపక్కల గల గ్రామాల్లో మద్యం అమ్మకాలు జరుగుతుండడం గమనార్హం. పట్టణ ప్రాంతంలో వైన్స్‌లు రాత్రి 10 గంటలకు మూసివేయగా బెల్ట్ షాపుల్లో మాత్రం ఏ మధ్య రాత్రి అయినా తలుపు తట్టిన క్షణం ఏటీఎం లాగా కావలసిన మద్యం లభిస్తుంది అనే విధంగా కొనసాగుతున్న ఆటు ఎక్సైజ్ పోలీసులు, పోలీస్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు డివిజన్లలో డివిజన్ లోని ఒక్కో ప్రాంతంలో సుమారు రెండు మూడు బెల్ట్ షాపులు ఉన్నాయి. నిజామాబాద్ రూరల్ మండలంలోని చుట్టుపక్కల గ్రామాలు కలుపుకొని సుమారు ఒకటి రెండు మూడు వరకు బెల్టుషాపులు ఉన్నాయని స్థానిక ప్రజలు అనుకుంటున్నారు. మద్యం దుకాణాలను నుంచి చుట్టుపక్కల గ్రామాలకు మద్యం సరఫరా చేస్తున్నారని చుట్టుపక్కల గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు కిరాణా షాపులు, చిన్న చిన్న దుకాణాల్లో సైతం అమ్ముతున్నారు.



పేరుకే కిరాణం షాపులు, అమ్మేది మద్యం...?

పట్టణ కేంద్రంలోను, గ్రామాల్లోనూ కొంతమంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యము వ్యాపారం చేస్తున్నారు. దీనికి తోడు వైన్ షాప్‌ల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి కొన్ని కొన్ని ఊర్లకు ఒక షాపు అనేవిధంగా నిర్వహిస్తున్నారు. మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు రభస చేస్తున్నారని పలు కాలనీలలో ప్రజలు ఆరోపిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పలు కాలనీలలో విచ్చలవిడిగా దొరుకుతున్న మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతోంది. పట్టణాల్లో, గ్రామాలలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. దీంతో పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. పట్టణాలోని పలు డివిజన్లో నిర్వహిస్తుండటంతో యువత పెడదారి పడుతోంది. ఇదే ఆసరాగా చేసుకున్న యువత సైతం మద్యం తాగుతూ అక్కడే పడిపోతున్న ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

మత్తుకు బానిసవుతున్న యువత...

జిల్లా కేంద్రంలోని పలు డివిజన్లలో యువతతో పాటు, గ్రామాల్లో గల్లీగల్లీకో బెల్ట్ షాపు వెలుస్తుండడంతో యువరులు మద్యానికి అలవాటు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. అప్పులు చేసి మరి అధిక ధరకు మద్యాన్ని కొనుగోలు చేసి ఇబ్బందుల పాలవుతున్నారు. బెల్ట్ షాపుల్లో వేకువజామున మద్యం దొరుకుతుండడంతో జిల్లా కేంద్రంలో ఉదయాన్నే మద్యం తాగుతూ బానిసవుతున్న దశ్యాలు సైతం పలు కాలనీలలో కనబడుతున్నాయి. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నా పాలకులు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది నేతల ప్రోత్సాహంతోనే పలు డివిజన్లో, గ్రామాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా పట్టించుకోక పోవడంతో బెల్టుషాపుల నిర్వాహకులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు అడ్డూ అదుపు లేకుండా జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ముఖ్యంగా బెట్టు పాపుల్లో మద్యం కల్తీ విపరీతంగా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. కల్తీ మద్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది. అయినా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇకనైనా అధికారులు బెల్ట్ పాపులపై నిఘా ఉంచి అక్రమం గా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై ఉక్కు పాదం మోపాలుని ప్రజలు కోరుతున్నారు.

నేడే మెగా రక్తదాన శిబిరం

- రక్తదానం చేసే రక్తదాతలకు షబ్బీర్ ఫౌండేషన్ ద్వారా హెల్మెట్ల పంపిణీ
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సిరిసిల్ల రోడ్డులోగల క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి శుక్రవారం తెలిపారు. మహమ్మద్ షబ్బీర్ అలీ తన జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం 2023 నుండి రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని, తెలిపారు. రక్తదానానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, రక్తదాతలు రావాలని, రక్తదానం చేసే ప్రతి రక్తదాతకు హెల్మెట్‌ను అందజేయడం జరుగుతుందని,చిన్నారుల ప్రాణాల కోసం ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తునన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారంలో కార్యదర్శులు

నవతెలంగాణ-భిక్కనూర్

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా పంచాయతీ కార్యదర్శులు నిమగ్నమయ్యారు. శుక్రవారం మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామంలో మంచినీటి పైప్‌లైన్ లీకేజీ పనులకు మరమ్మతులు చేపట్టారు. కంచర్ల గ్రామంలో నీటి కష్టాలు తీర్చడానికి చెడిపోయిన మోటార్లను బాగు చేయించారు. మంకీ ఫుడ్ కోర్ట్‌లో గ్రామపంచాయతీ సిబ్బంది చేత మొక్కలకు నీళ్ల పోయించారు. ర్యాగట్లపల్లి గ్రామంలో గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురికి కాలువలను పంచాయతీ సిబ్బంది చేత శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అఖిల, సౌజన్య, స్వప్న, పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు.



పనులు చేయిస్తున్న కార్యదర్శులు